

రోడ్డు ప్రమాదంలో బెక్కెం వాసి మృతి

చిన్నంబావి మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బెక్కెం గ్రామానికి చెందిన రవికుమార్‌రెడ్డి(44) పది సంవత్సరాలుగా భార్యా పిల్లలతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. బెక్కెం గ్రామానికి చెందిన స్నేహితుడు కుమారుడి పెళ్లి మేడిపల్లి, కమలానగర్ హైదరాబాద్‌లో ఉండటంతో అతను మరో స్నేహితుడితో కలిసి కారులో వివాహానికి వెళ్లారు. పెళ్లికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. హైదరాబాద్ ఓఆర్ఆర్ వద్ద చెట్లకు నీటిని పడుతున్న నీటి ట్యాంకర్‌కు వెళ్లి కారు ఢీకొంది. దీంతో కారులోని రవికుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

స్వర్ణకారుడి ఇంట్లో చోరీ

- వెండి, బంగారం, నగదు అపహరణ
- జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఘటన

7



'డ్రాగన్' సిరులు

- పత్తి, కంది సాగుతో నష్టపోయిన రైతు
- డ్రాగన్ పండ్ల తోట పెంపకంపై మొగ్గు
- యూట్యూబ్‌లో చూసి మెళకువలు
- కురుమూర్తి గ్రామ శివారులో సాగు

7

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

- వనితాజ్యోతి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు



ఆవాజ్ రేడియో ద్వారా పథకాలపై గిరిజన మహిళకు అవగాహన

7

909 గ్రాముల గంజాయి స్వాధీనం

- విక్రయిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- జార్ఖండ్‌కు చెందిన ఐదుగురి అరెస్ట్, రిమాండ్

7

అప్రోచ్ రోడ్డు పనులు షురూ..




సమీకృత మార్కెట్ యార్డు వద్ద ప్రారంభమైన అప్రోచ్ రోడ్డు పనులు

అయిజటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణం లోని సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కు వెళ్లే రోడ్డుపనులు ప్రారంభిం చారు. ఈ నెల 4వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన మునిపల్ అధికారులు గురు వారం సమీకృత మార్కెట్ లోపలికి వెళ్లే అప్రోచ్‌రోడ్డు పనులను ప్రారంభించారు. త్వరలోనే పనులు పూర్తి చేసి మార్కెట్‌ను వినియోగంలోకి తీసు కువస్తామని అధికారులు తెలిపారు. మార్కెట్ వినియోగంలోకి వస్తే దుమ్ము ధూళీ పడిన కూర గాయలు, మాంసం కొనే ఇబ్బందులు తప్పుతాయని కొనుగోలు దారులు అభిప్రాయ పడుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సా..గుతున్న సహాయక చర్యలు

- బలమైన సెగ్మెంట్ బ్లాకుల్లో పగుళ్లు
- ఉబికి వస్తున్న ఊట నీరు.. ముందుకు సాగని పనులు
- నేటి నుంచి యంత్రం సహాయంతో తవ్వకాలు
- 13 రోజులుగా లభించని గల్లంతైన వారి ఆచూకీ



సొరంగంలోని 13.5వ కిలో మీటరు వద్ద పేరుకుపోయిన బురద..



సొరంగం లోపల తవ్వకాలు చేపడుతున్న రెస్క్యూ బృందాలు

దోమలపెంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం ప్రమాదంలో గల్లంతైన వారిని గుర్తించేందుకు 13 రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే తవ్వకాల సందర్భంగా ఊటనీరు రావడం, సొరంగం తవ్విన వెంటనే అమర్చే సెగ్మెంట్ బ్యాకుల్లో పగుళ్ల వస్తుండటంతో పనులు ఆలస్యమౌతున్నాయి.

టీబీఎం తొలగింపు పూర్తయితే..

ఈ సొరంగంలో టీబీఎం(టన్నెల్ బోరింగ్ మిషన్) 10 మీటర్ల వ్యాసార్థంలో రంధ్రాన్ని తొలుస్తుంది. సొరంగాన్ని 9.2 మీటర్ల వరకు కుదించేందుకు అడుగు భాగాన ఐ1(బరువు 9 టన్నులు), మధ్య భాగంలో ఎస్ 2, ఎస్ 3, ఎస్ 4, టీఆర్ 5, టీఎల్ 6(బరువు 6 టన్నులు) సెగ్మెంట్ బ్లాకులను అమార్చుతారు. పైభాగంలో అమర్చే కే7 సెగ్మెంట్ బ్లాకుల బరువు 3 టన్నులు ఉంటుంది. ఇంతటి పటిష్ఠమైన బ్లాకులు కూడా ప్రమాదం వల్ల కుంగి, పగుళ్లు వచ్చాయి. సొరంగంలోని 13.9 కిలో మీటరు వద్ద కొత్తగా ఏర్పాటు చేసి సెగ్మెంట్ బ్లాకులు కూలిపోయాయి. ఐదేళ్ల క్రితం అమర్చిన బ్లాకుల నుంచి నీటిఊట వస్తోంది. ఈ నేపథ్యంలో రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నా పురోగతి కనిపించడం లేదు. ప్రస్తుతం సొరంగం కూలిన చోట, టీబీఎం మిషన్ సమీపంలో తవ్వకాలు జరుపుతున్నారు. టీబీఎం మిషన్ వెనుక భాగాన్ని గ్యాస్‌తో కట్ చేసి, లోకో ట్రైన్ ద్వారా బయటికి తెస్తున్నారు. వేగంగా పనులు జరిగేందుకు మరోవైపు అదనంగా రెండు బోగీలను తయారు చేస్తున్నారు. టీబీఎం మిషన్ వెనుక భాగం తొలగింపు పూర్తయితే నేటి నుంచి మినీ ఎక్స్‌కవేటర్ సహాయంతో తవ్వకాలు చేపట్టే అవకాశం ఉంది.



గల్లంతైన వారి ఆచూకీ కనుక్కునేందుకు కేరళ నుంచి రప్పించిన శునకం

పారే నీటిలో పసిగట్టేనా..

సొరంగంలో చిక్కుకున్న 8 మంది ఆచూకీని గుర్తించేందుకు కేరళ నుంచి 2 స్నిఫర్ డాగ్‌లను గురువారం రప్పించారు. పరిస్థితులను అంచనా వేసేందుకు కే9 డాగ్ స్క్వాడ్, నలుగురు సభ్యుల బృందం సొరంగంలోకి వెళ్లారు. గత ఏడాది కేరళ రాష్ట్రం వయనాడ్ జిల్లాలో సంభవించిన వరద ప్రమాదంలో గల్లంతైన, శిథిలాల కింద చిక్కుకున్న వారిని ఈ శునకాలు గుర్తించాయి. ఇక్కడ కూడా గల్లంతైన వారిని ఆ శునకాలు గుర్తించవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే బురద పేరుకుపోవడం వల్ల అది సాధ్యమౌతుందా? అన్న చర్చ జరుగుతోంది.



జనవరి 22న డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రారంభానికే పరిమితం

ఆత్మకూరులో పనిచేయని డయాలసిస్ సెంటర్

- జనవరి 22న ప్రారంభించిన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- నేటికీ అందుబాటులోకి రాని డయాలసిస్ సెంటర్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు

6



ఫైరింగ్ ప్రాక్టీసులో పాల్గొన్న పోలీసులు



ఫైరింగ్‌లో పాల్గొన్న ఎస్పీ రావుల గిరిధర్

పోలీసులు ఆయుధాలపై అవగాహన పెంచుకోవాలి

- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి 10వ బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. పోలీసులు వారి విధుల్లో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీసు చేయించారు. ఒక్కొక్కరికి పది రౌండ్లు చేసే అవకాశం కల్పించారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఆయుధాలను క్రమం తప్పకుండా శుభ్రపరుచుకోవాలని ఆదేశించారు. పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలను నిర్వర్తించాలని జిల్లాకు, తెలంగాణ పోలీస్ శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్బ్ ఎస్పీ ఉమామహేశ్వరరావు, సైబర్ క్రైం డీఎస్పీ రత్నం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్‌ఆదర్శ్ సురభి

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి క్యాన్సర్ దరిచేరకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం వనపర్తి పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని, డయాబెటిస్, రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, విటమిన్ డీ-3, విటమిన్ బీ-12, థైరాయిడ్ వంటి వ్యాధులకు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను మహిళా ఉద్యోగులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. క్యాన్సర్ మహమ్మారిని స్క్రీనింగ్ ద్వారా ముందుగానే గుర్తిస్తే ప్రాణానికి ముప్పు లేకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. అనంతరం ఎంసీహెచ్ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి ఉన్నారు.



వనపర్తిలో హాల్ టికెట్ నెంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు



నాగర్‌కర్నూల్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



గద్వాలలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) 6:30

సహెర్ (శనివారం) 5:08



పశుబల ప్రదర్శన తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చిన రైతులు, నాయకులు



ప్రథమ స్థానంలో నిలిచిన ఖాజా ఎద్దులు

అంబరాన్నంటిన రైతు సంబురాలు

- హోరాహోరీగా ఎద్దుల బల ప్రదర్శన
- మొదటి బహుమతి కైవసం చేసుకున్న ఫల్కందొడ్డి ఖాజా ఎద్దులు
- బహుమతులు అందజేసిన అలంపూర్ ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి

రాజోలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి పట్టణంలోని భ్రమరాంబిక అడివేశ్వరస్వామి జాతర సందర్భంగా నిర్వహించిన రైతు సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం అంతర్‌రాష్ట్ర సీనియర్ విభాగ పశువుల (పెద్దఎద్దుల) బల ప్రదర్శన కార్యక్రమాన్ని దేవస్థాన కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 10 జతల ఎద్దులు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో కర్ణాటక రాష్ట్రం ఫల్కందొడ్డి గ్రామానికి చెందిన ఖాజా ఎద్దులు 2,593 అడుగులు వరకు బండను లాగి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాయి. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అందించిన రూ.50 వేలను ఎద్దుల యజమానికి అలంపూర్ జోగుళాంబ ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి అందజేశారు. పీఆర్ పల్లి గ్రామానికి చెందిన మండలి నాగయ్య ఎద్దులు 2,277 అడుగులు లాగి రెండో బహుమతి కైవసం చేసుకోగా వారికి రూ. 40 వేలు బహూకరించారు. నాగయ్య మరో జత ఎద్దులు 2,071 అడుగులు లాగి మూడో బహుమతి రూ.30 వేలు అందుకున్నారు. గార్లదిన్నె గ్రామానికి చెందిన రామాంజనేయులు ఎద్దులు 2,007 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ. 20 వేలు అందుకున్నారు. కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్‌చైర్మన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, నాయకులు హసన్, గంగిరెడ్డి, వంక మహేష్, గొర్కల్ వీరేష్, కుర్వ వెంకటేశ్వర్లు, నిర్వాహకులు నాగేశ్వర్‌రావు, గోపాల్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు రెండో రోజు ప్రశాంతం

నాగర్‌కర్నూల్‌టౌన్/వనపర్తి రూరల్/గద్వాలసర్కిల్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా గురువారం రెండో రోజు నిర్వహించిన ద్వితీయ సంవత్సరం మొదటి పేపర్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 33 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 6,046 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,882 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 4,755 మందిగికి గాను 4,617 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,291 మంది విద్యార్థులకు గాను 1,265 మంది హాజరయ్యారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 5,795 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5663 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్‌లో 4,841 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4,745 మంది హాజరయ్యారు. ఒకేషనల్ 954 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 918 మంది హాజరయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 3,685 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 3,583 మంది హాజరయ్యారని ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు తెలిపారు. వీరిలో జనరల్ 3,027 విద్యార్థులకు 2,945 మంది విద్యార్థులు, వృత్తి విద్యా 658 మంది విద్యార్థులకు 638 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. పరీక్షా కేంద్రాలను కన్వీనర్ పరిశీలించి పరీక్షల నిర్వహణ గురించి చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు.



గద్వాల : విద్యార్థులను తనిఖీ చేస్తున్న కానిస్టేబుల్

కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న భూపాల్

నారాయణపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలకనుగుణంగా 73వ షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంటు పరిధిలో కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ డిమాండ్ చేశారు. గురువారం నారాయణపేట మునిసిపల్ పార్కు దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగ కార్మికుల ధర్నానుద్దేశించి ఆయన ప్రసంగించారు. 73వ షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్ పరిధిలో పనిచేస్తున్న కోటి 20 లక్షల మందికి వర్తించే జీవోలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2012 నుంచి నేటి వరకు సవరించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 నుంచి 2023 వరకు కనీస వేతనం ప్రతిపాదనలకే పరిమితం చేసిందని ఆరోపించారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. కనీస వేతనం జీవోను సవరించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగవ కార్మిక కోడ్లు ఏప్రిల్ నుంచి అమలు కాబోతున్నాయన్నారు. ఇవి అమలు అయితే కార్మికుల కనీస హక్కులు కోల్పోతారన్నారు. నాలుగు కార్మికకోడ్‌లు వెనక్కి నెట్టేందుకు కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో జయసుధకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐసీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సాయిలు, కృష్ణ మడివాల్, ఉమాదేవి, లక్ష్మీదేవి, భాస్కర్, రవికుమార్ తదితరులున్నారు.

రూ.31 లక్షలతో యాక్షన్ ప్లాన్

● నారాయణపేటలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక
● ఇప్పటికే అధికారులతో సమీక్ష చేసిన కలెక్టర్ సిక్తా పట్నాయక్
● మిషన్ భగీరథ నీరు బంద్ అయితే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశం

నారాయణపేట, మార్చి6 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నారాయణపేట జిల్లాలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికారులు రూ.31 లక్షలతో యాక్షన్ ప్లాన్ రూపొందించారు. మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడ్డ మునిసిపాలిటీల్లో లీకేజీల వల్ల నీటి సరఫరాకు అవాంతరాలు ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా బోర్లను మరమ్మతులు చేయించడం, నీరు తక్కువగా ఉంటే క్రషింగ్ చేయించడం, పాత మోటర్ల స్థానంలో కొత్త మోటర్ల బిగింపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఇటీవల సమీక్ష నిర్వహించి అధికారులను ఆదేశించారు.

నారాయణపేటలో రోజు విడిచి రోజు నీటి సరఫరా

నారాయణపేట మునిసిపాలిటీ పరిధిలో 24 వార్డులు ఉన్నాయి. 72 లక్షల లీటర్ల తాగు నీరు అవసరం ఉండగా, మిషన్ భగీరథ పథకం ద్వారా 70 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. మునిసిపాలిటీ పరిధిలో 101 పవర బోర్లు ఉండగా, అందులో రెండు బోర్లలో నీరు ఇంకిపోయింది. దాంతో ఫ్లషింగ్ చేయాల్సి ఉంది. 35 బోర్లలో మోటార్లు పాతవి కావడంతో తరచుగా కాలిపోతున్నాయి. దాంతో వాటి స్థానంలో కొత్తవి బిగించనున్నారు. ఎద్దడిని అధిగమించేందుకు అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించారు. అందులో భాగంగా మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్ అయినా.. ప్రత్యామ్నయ్యంగా సరఫరా చేసేందుకు రూ.31 లక్షలతో ప్రణాళికలు రూపొందించారు. అదనపు కలెక్టర్ బెన్‌షాలం ఈ నిధుల వినియోగానికి అనుమతి పొందారు.

మక్తల్‌లో 20 బోర్లకు మరమ్మతు అవసరం

మక్తల్ మునిసిపాలిటీలో 16 వార్డులకు గాను మిషన్ భగీరథ పథకం నుంచి రోజూ 39,0000 మిల్లీ లీటర్ల నీరు సరఫరా అవుతోంది. 140 బోర్లు ఉండగా, అందులో 120 పని చేస్తున్నాయి. మిగతా 20 బోర్లను మరమ్మతులు చేస్తున్నారు.

కోస్గిలో రూ.10 లక్షలు కేటాయింపు

కోస్గి మునిసిపాలిటీలో 16 వార్డులకు గాను 3.68 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, 1.09 ఎంఎల్‌డీల నీరు మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అవుతోంది. కొన్ని ప్రాంతాలకు 18 బోర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. వేసవిలో ఎద్దడి నివారణకు జనవరిలో పాలక మండలి ఉన్నప్పుడే రూ.10 లక్షలను కేటాయించారు.

ఆ ట్యాంకులు పూర్తయితే రోజూ నీళ్లు

నారాయణపేటలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.27.66 కోట్లతో అమృత్ 2.0 పథకం కింద ఎర్రగుట్ట, టీచర్స్ కాలనీ, వాల్మీకి ఆలయం గుట్ట వద్ద భారీ ట్యాంకులను నిర్మిస్తున్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఎర్రగుట్ట దగ్గర ఇటీవల శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభించారు. ఈ ట్యాంకులను పూర్తి చేసి, మునిసిపాలిటీలోని కొత్త కాలనీలతో పాటు పట్టణ ప్రజలకు రోజూ తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చెప్పారు.

ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీమీట్‌లో ప్రతిభ

● కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ


కానిస్టేబుల్ చంద్రశేఖర్ గౌడ్‌కు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాజధాని రాంచీలో 68వ ఆల్‌ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు సత్తాచాటారు. తెలంగాణ పోలీస్ బృందం ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్‌తో పాటు అన్ని రాష్ట్రాల కంటే అత్యధిక పతకాలు సాధించి అగ్రభాగాన నిలిచింది. అందులో నారాయణపేట కానిస్టేబుల్ చంద్రశేఖర్ గౌడ్ బాంబు డిస్పోజల్ టీమ్ నుంచి రూమ్ సెర్చింగ్‌లో ప్రతిభ కనబర్చి వీవీపీ రూమ్ సర్చింగ్ ఈవెంట్ లో ప్రతిభ కనబర్చి సెకండ్ పోజిషన్లో ట్రోఫీ సొంతం చేసుకోవడం జరిగింది. అందులో జిల్లా నుంచి పాల్గొని ప్రతిభ కనబర్చిన చంద్రశేఖర్‌గౌడ్‌ను గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించి ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింహ తదితరులున్నారు.

సాగు నీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు

● మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి
● సంగంబండ రిజర్వాయర్ నుంచి కాలువకు నీటి విడుదల


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మక్తల్ వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో రైతన్నలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. రైతులకు కోరిన వెంబడే సంగంబండ రిజర్వాయర్ నుంచి నర్వ ఆత్మకూర్ వైపునకు వెళ్లే హై లెవెల్ లెఫ్ట్ కెనాల్‌కు సాగునీటిని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాజాగా కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నారాయణపూర్ డ్యాం నుంచి సాగునీటిని విడుదల చేయించుకున్నామని, రాబోయో రోజుల్లో సైతం రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. నాయకులు చంద్రకాంత్‌గౌడ్, గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేయాలి


పెద్దవాగులో రైతులు ఏర్పాటు చేసుకుంటున్న బోర్లు

మాగనూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాగనూరు మండలంలోనిన పెద్ద వాగుపై చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. పెద్ద వాగులో ప్రతి సంవత్సరం ఇసుక రీచుల ద్వారా రాత్రి సమయంలో అక్రమ ఇసుక తరలిపోతున్నది. దీంతో వాగులో నీటి మట్టం తగ్గిపోయి రైతుల చేతి పంపు బోర్లు నీరందక వేసవి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వాగుపై సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉంది. వర్షాకాలం గేట్లు తెరిచి దిగువకు నీరు వదిలిన సమయంలో వృథాగా నీరు కృష్ణానదిలో కలుస్తున్నది. వాగుపై చెక్ డ్యాంలు ఏర్పాటు చేస్తే నీరు నిల్వ ఉండి రైతు పంట పొలాలకు, గ్రామాలకు మంచినీటి సౌకర్యం కలుగుతుందని మండల ప్రజలు అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వాగులో చెక్ డ్యాంలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



మంత్రాలయంలో భరతనాట్య ప్రదర్శన ఇచ్చిన బృందం

మక్తల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లా మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆలయంలో గురువారం మక్తల్ ఆద్య నృత్యాలయ అకాడమీ బృందం ప్రదర్శించిన భరతనాట్యం ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆద్య నృత్య ప్రదర్శన గురువు జోషి హారతి మాట్లాడుతూ శ్రీ గురురాఘవేంద్రస్వామి ఆలయం వద్ద మంత్రాలయం వేదికగా భరతనాట్య నృత్య ప్రదర్శ చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో మంత్రాలయం పీఠాధిపతి సుదేంద్ర తీర్థులు ప్రశంసాపత్రం, బహుమతులు అందించినట్లు తెలిపారు. ఆద్య నృత్యాలయ అకాడమీ ఆధ్వర్యంలో పవిత్ర పుణ్యక్షేత్రంలో ఇతిహాసాలకు సంబంధించి భరతనాట్య ప్రదర్శన ఇవ్వడం సంతోషం అన్నారు. విద్యార్థులు సాయిసప్తశ్రీ బృంద, ఆరాధ్య, ప్రవత్య, ప్రసన్న, ఆశినీ, అక్షిత, క్రితి, మనస్విని, దత్తు, ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు చెల్లించాలి

- మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసియొద్దీన్


జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆసుపత్రి కార్మికులు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసియొద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ కన్సల్టెన్సీ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ నుంచి మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సూపరింటెండెంట్ చొరవ తీసుకుని పాత కాంట్రాక్టర్ ద్వారా కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, బాలకిష్టమ్మ, రాధ, రేణుక, సంతోష, లక్ష్మీ, శ్రీదేవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించాలి

- మునిసిపల్ కమిషనర్ షేక్ మహమ్మద్


ఆస్తి పన్ను చెల్లించాలని డప్పు కొడుతున్న సిబ్బంది

కల్వకుర్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పన్ను చెల్లించి మునిసిపల్ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కమిషనర్ షేక్ మహమ్మద్ కోరారు. పట్టణంలోని కమర్షియల్ భవనాలు, ఫంక్షన్ హాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌ల ఆస్తి పన్ను బకాయి ఉన్న వారి ఇళ్లకు తాళాలు వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారులు మునిసిపల్‌కు సహకరించాలని ఆయన కోరారు.

ఇంటి ముందు డప్పు కొట్టి చాటింపు

ఆస్తి పన్ను చెల్లించలేదని మునిసిపల్ అధికారులు ఇంటి ముందు డప్పు కొట్టి గురువారం చాటింపు చేశారు. పట్టణంలోని జేఎల్‌బీ కాలనీకి చెందిన కొన్ని ఇళ్ల ముందు పన్ను చెల్లించాలని డప్పు చాటింపు చేశారు. దీంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి యజమానులకు ఇంటి పన్ను చెల్లించాలని ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో డప్పు చాటింపు చేసినట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు.

ప్రారంభానికే పరిమితం

ఆత్మకూరులో పనిచేయని డయాలసిస్ సెంటర్



ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం


ఆత్మకూరు డయాలసిస్ కేంద్రంలో రోగుల కోసం ఏర్పాటు చేసిన మంచం

ఆత్మకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వ్యాధి తీవ్రతను బట్టి కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. కొందరికి 24గంటలు, మరి కొందరికి 36 గంటలు, 72 గంటల పాటు ఖచ్చితంగా డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. లేని పక్షంలో వారు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. కావునా సుదూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేసుకోవాలంటే ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కృషితో జనవరి 22న వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌కేర్ సెంటర్(సీహెచ్‌సీ)లో డయాలసిస్ సెంటర్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ప్రారంభించారు. కానీ డయాలసిస్ సెంటర్‌లో అవసరమైన పరికరాలు, సిబ్బంది కేటాయింపుతో సంబంధం లేకుండా వనపర్తి జిల్లా ఆసుపత్రిలోని డయాలసిస్ యంత్ర సామాగ్రిని ఆత్మకూరుకు తరలించి ప్రారంభించారు. ఆత్మకూరులోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం స్థానికులు చేశారు. డయాలసిస్ సెంటర్ ప్రారంభించిన 24 గంటలు గడవకముందే పరికరాలను మళ్లీ వనపర్తి జిల్లా కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం ఆత్మకూరు డయాలసిస్ కేంద్రంలో రెండు ఖాళీ మంచాలు మినహాయిస్తే యంత్రాలు కనిపించడం లేదని కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరిస్థితిలో వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రాలలోని ఆసుపత్రులలో వైద్యం చేయించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆత్మకూరు డయాలసిస్ సెంటర్‌లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఆరంభం.. అంతలోనే మాయం



సుదూర ప్రాంతాలకు వెళ్లి రక్తశుద్ధి చేసుకునే ఇబ్బంది లేకుండా ఆత్మకూరు పట్టణంలోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారని సంబుర పడేలోపు యంత్ర పరికరాలు మాయమయ్యాయి. ఇచ్చిన హామీ ప్రకారం ఆత్మకూరు డయాలసిస్ కేంద్రంలో యంత్ర సామాగ్రిని ఏర్పాటు చేసి సేవలు అందుబాటులోకి తేవాలి

- అశ్విన్‌కుమార్, ఆత్మకూరు మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్

రెండు నెలల సమయం పడుతుంది

ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవం రోజే రెండు నెలల సమయం పడుతుందని తెలియజేశాం. డయాలసిస్ సేవలు అందుబాటులోకి రావాలంటే అండర్‌గ్రౌండ్‌డ్రైనేజీ, సరిపడా యంత్రాలు, సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు మరో రెండు నెలల సమయం పడుతుంది.

- చైతన్య గౌడ్, డీసీహెచ్, వనపర్తి

ప్రభుత్వ మెడికల్ ఆసుపత్రి పనులు సకాలంలో పూర్తిచేయాలి

● డీఎంఈ నరేంద్రకుమార్


ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డీఎంఈని శాలువా, పుష్పగుచ్ఛం అందించి సన్మానిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి

గద్వాల న్యూటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, ఆసుపత్రి పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డీఎంఈ(డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) ఏ. నరేంద్రకుమార్ అన్నారు. గురువారం జిల్లా జనరల్ ఆసుపత్రిని మొదటిసారిగా సందర్శించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆయనను మర్యాదపూర్వకంగా స్వాగతించారు. జిల్లాకు మొదటిసారిగా వచ్చిన డీఎంఈ నూతనంగా నిర్మాణమవుతున్న మెడికల్ కళాశాల ఆసుపత్రిని, కళాశాల సైట్‌ను పరిశీలించారు. అన్నిహంగులతో సకాలంలో పనులు పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి అన్ని గదులను పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిపరీక్షలు చేస్తున్నారా అనే విషయాలపై చర్చించారు. సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిర, డిప్యూటి సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- గ్రామ సభలో పెసా కమిటీ ఆధ్వర్యంలో చర్చ


మల్లాపూర్ పెంటలో సమస్యలపై చర్చిస్తున్న ఆదివాసీ చెంచులు

మన్ననూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం నల్లమల లోతట్టు ప్రాంతంలోని మల్లాపూర్ పెంటలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని పెసా చట్టం అమలు కమిటీ సభ్యులు కోరారు. గిరిజన హక్కుల కోసం ప్రభుత్వ పరంగా ఉన్న పెసా చట్టం అమలుకు ఆదివాసీ గిరిజనులతో కమిటీ ఏర్పాటు చేశారు. పెసా కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ చెంచులు గ్రామ సభను గురువారం నిర్వహించారు. పెసా కమిటీ ఉపాధ్యక్షుడు చిగుర్ల పెద్దబయ్యన్న అధ్యక్షతన 26 మంది సభ్యుల సమక్షంలో సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. మల్లాపూర్ పెంటలో ఉన్న సౌరశక్తి తాగునీటి బోర్లు నీరు పోయడం లేదని, వాటిని కడిగించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, అదనంగా మరో బోరును డ్రిల్ చేయించాలని కోరారు. ఆర్డీటీ సంస్థ వారు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేసి ఆదుకుంటున్నారని, చెంచుల కోసం పనిచేసే ఐటీడీఏ వారు పెంటల్లో తాగునీటి సరఫరాకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంప్రదాయ సరిహద్దుల మ్యాప్‌లపై హక్కులు కల్పించాలని, అటవీ హక్కుల చట్ట ప్రకారం భూమి హక్కు పత్రాలను అర్హులందరికీ ఇవ్వాలని, రైతు బంధు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అర్హులైన చెంచులందరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్ర భవనం, 6 నుంచి 10 ఏళ్ల పిల్లల కోసం పాఠశాల భవనం నిర్మించాలని, ఇదివరకే మంజూరైన కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని గ్రామ సభలో తీర్మానం చేశారు. ఈ తీర్మానాల ప్రతులను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, ఐటీడీఏ పీవో, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలకు పంపించనున్నట్లు పెసా కమిటీ సభ్యులు తెలిపారు. సమావేశంలో పెసా కమిటీ సభ్యులు చిన్న బయ్యన్న, లింగమ్మ, వెంకలమ్మ, లక్ష్మమ్మ, గురువమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొన్న ట్రక్కు

- అక్కడికక్కడే మృతి

మహబూబ్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని ట్రక్కు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని జమిస్తాపూర్‌కు చెందిన భీమయ్యగౌడ్(60) గురువారం పెళ్లికి హాజరయ్యేందుకు సైకిల్‌పై మహబూబ్‌నగర్ వస్తున్న క్రమంలో పాలమూరు యూనివర్సిటీ వద్ద ట్రక్కు ఢీకొట్టింది. అదుపు తప్పి కిందపడిన భీమయ్యపై నుంచి ట్రక్కు వెళ్లడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. రోడ్డుపై ప్రమాదం జరగడంతో స్థానికులు పెద్దఎత్తున గుమిగూడారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రైం కార్నర్

ఆవుదూడను చంపిన అడవి జంతువు

తిమ్మాజిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అడవి జంతువు దాడిలో ఆవుదూడ చనిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండల పరిధిలోని చేగుంటకు చెందిన రైతు తుంగని బాలయ్య బుధవారం రాత్రి తన పొలంలోని కొట్టంలో ఆవు దూడలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఒక దూడపై గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. సమాచారం అందుకున్న నాగర్‌కర్నూల్ జిల్లా అటవీశాఖ సెక్షన్ అధికారి చంటి గురువారం సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. అడవి జంతువును పట్టుకోవడానికి ప్రత్యేకమైన బోన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కేఎల్‌ఐ కాలువలో వృద్ధురాలి మృతదేహం

బిజినేపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని పోలేపల్లి గ్రామ సమీపంలోని కేఎల్‌ఐ కాలువలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ కె.శ్రీనివాస్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేఎల్‌ఐ కాలువలో మృతదేహం పడి ఉన్నట్లు గ్రామస్థులు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కాలువలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

హన్వాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలోని కొనగట్టుపల్లికి చెందిన దర్పల్లి లక్ష్మమ్మ(45) హన్వాడ పెద్ద చెరువులో పడి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మమ్మ గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా హన్వాడకు వచ్చి కల్లు తాగింది. ఆ మైకంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. ఆమె మానసిక పరిస్థితి కూడా బాగాలేదని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీసి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి..

బల్మూరు, (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందాడు. ఎస్‌ఐ రమాదేవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్ల, బల్మూరు మండల పరిధిలోని గట్టుతుమ్మెన్‌కు చెందిన మల్లయ్య (41) బుధవారం సాయంత్రం చేపలు పట్టేందుకు గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం అతడి మృతదేహం చెరువులో తేలడంతో స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



సోలీపూర్ సింధు రైస్ మిల్లు వద్ద వాహనంలో రేషన్ బియ్యం

ఖిల్లాఘణపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సేకరించిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి విక్రయిస్తుండగా పట్టు కున్నట్లు ఎస్‌ఐ సురేష్ గౌడ్ తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్‌లో సింధు ఇండస్ట్రీస్ రైస్ మిల్లు వద్ద అశోక్ లేల్యాండ్ వాహనంలోని 6 క్వింటాళ్ల బియ్యాన్ని బుధవారం రాత్రి సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోపాల్‌పేట మండలం బుద్దారానికి చెందిన శ్రీమాన్‌పాడు రామకృష్ణ సోలీపూర్ గ్రామ పరిసరాల్లోని తండాల్లో రేషన్ బియ్యాన్ని కిలో 10 రూపాయల చొప్పున కొనుగోలు చేసి సింధు ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో అధిక ధరకు విక్రయించడానికి తరలిస్తూ పోలీసులకు చిక్కాడు. బియాన్ని స్వాధీనం చేసుకొని, వనపర్తి స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. సివిల్ సప్లయ్ నయాబ్ తహసీల్దార్ దుబ్బాక పరమేష్ ఫిర్యాదు మేరకు వాహనం యజమాని శ్రీమాన్‌పాడు రామకృష్ణ, సింధు ఇండస్ట్రీస్ రైస్ మిల్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రాగన్ సిరులు



» పత్తి, కంది సాగుతో నష్టపోయిన రైతు » డ్రాగన్ పండ్ల తోట పెంపకంపై మొగ్గు

» యూట్యూబ్‌లో చూసి మెళకువలు » కురుమూర్తి గ్రామ శివారులో సాగు

చిన్నచింతకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పత్తి, కంది పంటల సాగులో నష్టాలతో విసిగిపోయిన రైతు విభిన్నంగా ఆలోచించాడు. పండ్ల తోట పెంచాలని నిర్ణయించుకున్నాడు. ఏ తోట వేయాలో తెలుసుకునేందుకు యూట్యూబ్‌లో అన్వేషించాడు. రకరకాల పండ్ల తోటలకు సంబంధించిన వీడియోలను చూశాడు. చివరకు 'డ్రాగన్ ఫ్రూట్స్' అయితే మేలు అనుకున్నాడు. సాగులో మెళకువలను తెలుసుకున్నాడు. తన ఎకరం పొలంలో తోటను పెంచాడు. మంచి లాభాలను గడిస్తున్నాడు. ఆయన స్ఫూర్తితో మరికొందరు రైతులు కూడా అదే బాటన నడుస్తున్నారు.

మహారాష్ట్ర నుంచి మొక్కలు

మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలం, కురుమూర్తి గ్రామానికి చెందిన రైతు గోవిందుకు ఎకరం పొలం ఉంది. మొదట్లో కంది, పత్తి సాగు చేసేవాడు. పందుల బెడద, రకరకాల కారణాలతో దిగుబడి రాకపోవడం, మార్కెట్లో సరైన ధర పలకకపోవడంతో నష్టపోయాడు. ఇలా సాధారణ పంటలు కాకుండా పండ్ల తోట పెంచాలని నిర్ణయించుకున్నాడు. ఎకరం పొలంలో ఎలాంటి పండ్ల తోటలను సాగు చేయవచ్చో యూట్యూబ్‌లో చూసి తెలుసుకున్నాడు. డ్రాగన్ ఫ్రూట్స్ తోటపై ఆసక్తి కలగడంతో వీడియోలు చూసి ఇతర వివరాలను అధ్యయనం చేశాడు. రెండేళ్ల క్రితం మహారాష్ట్రలోని సోలీపూర్ ప్రాంతం నుంచి ఒక్కటి రూ.50 చొప్పున 4 వేల డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. తన ఎకరం పొలంలో ట్రెల్లిస్ పద్ధతిలో మొక్కలు నాటాడు. అందుకోసం రూ. 7 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ఏడాదిన్నరకు తోట కాపుకు వచ్చింది. మొత్తం 10 టన్నుల దిగుబడి వచ్చింది. ఇప్పటివరకు రెండు సార్లు హైదరాబాద్‌లోని బాటసింగారం పండ్ల మార్కెట్లో పండ్లను విక్రయించాడు. పెట్టుబడి పోను, రూ. 8 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ మొక్కలు దాదాపు 30 సంవత్సరాల వరకు దిగుబడిని ఇస్తూనే ఉంటాయని, ప్రతీ సంవత్సరం జూలై నుంచి డిసెంబర్ వరకు పండ్లు చేతికి వస్తాయని రైతు గోవిందు తెలిపారు. ఆయనతో పాటు గ్రామానికి కతలప్ప ఒక ఎకరం, విష్ణు రెండున్నర ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ తోటలు పెంచారు.

లాభాలు వస్తున్నాయి



గోవిందు, కురుమూర్తి గ్రామం : గతంలో పత్తి, కంది పంటలు సాగు చేసేవాడిని. తరచూ నష్టాలు రావడంతో విసిగిపోయాను. యూట్యూబ్ వీడియోలు చూసి పండ్ల తోటల సాగుతో లాభాలు, పద్ధతులు, రకాలను తెలుసుకున్నాను. డ్రాగన్ ఫ్రూట్ తోటలు ఎలా పెంచాలి, ఎంత పెట్టుబడి అవుతుంది తదితర విషయాలను అధ్యయనం చేశాను. ఇక ఏమీ ఆలోచించకుండా ఎకరం పొలంలోనే డ్రాగన్ మొక్కలు నాటాను. తోట కాపు మంచిగా వచ్చింది. ఎకరానికి రెండు సార్లు పది టన్నుల చొప్పున దిగుబడి వచ్చింది. పెట్టుబడి పోను లాభాలు వస్తున్నాయి.



గత ఏడాది గోవిందు తోటలో కాసిన డ్రాగన్ పండ్లు

అదే స్ఫూర్తితో నేను కూడా..



కతలప్ప, కురుమూర్తి : మా గ్రామానికి చెందిన గోవిందు స్ఫూర్తితో నేను కూడా డ్రాగన్ ఫ్రూట్స్ తోట వేశాను. అంతకుముందు పత్తి, కంది, బత్తాయి, దానిమ్మ వంటి పండ్ల తోటలను సాగు చేసేవాడిని. ఈ సారి కొత్తగా డ్రాగన్ ఫ్రూట్స్ తోట పెట్టాను. ఇప్పటికైతే తోట మంచిగానే ఉంది. దిగుబడి బాగానే వస్తుందని ఆశిస్తున్నాను. మమ్మల్ని చూసి ఇంకా కొంత మంది రైతులు కూడా దీనిపై ఆసక్తి చూపుతున్నారు.



గత ఏడాది దిగుబడి వచ్చిన డ్రాగన్ పండ్లు

స్వర్ణకారుడి ఇంట్లో చోరీ

» శుభకార్యానికి వెళ్లి వచ్చే లోపు సంఘటన » వెండి, బంగారంతో పాటు నగదును ఎత్తుకెళ్లిన దొంగలు

» జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఘటన » నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో మరో ఘటన

గద్వాల క్రైం/ అచ్చంపేట టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : శుభకార్యానికి వెళ్లి వచ్చే లోపు ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును దోచుకెళ్లారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజవీధిలో నివసిస్తున్న స్వర్ణకారుడు సంజీవ్‌కుమార్ గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. లోపలికి వెళ్లి పరిశీలించగా 5 కిలోల వెండి, 7 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 1.30 లక్షలు చోరీకి అయినట్లు గుర్తించారు. దీంతో వెంటనే పోలీసులకు



బాధితుడితో మాట్లాడుతున్న ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్

సమాచారం అందించారు. ఎస్‌ఐ కళ్యాణ్ కుమార్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్ల్యూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

● అచ్చంపేట పట్టణంలోని జూబ్లీనగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి రూ. 40వేలు దోచుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీ వాసి మహేశ్ మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి పనిమీద మరో ఊరికి వెళ్లారు. గురువారం తిరిగి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో ఉన్న రూ. 40వేలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు చోరీ జరిగిన ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు.

కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి

» వనితాజ్యోతి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు



కేంద్ర పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖిల్లాఘణపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వనితాజ్యోతి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఏకే కమర్ రెహమాన్ గిరిజనులకు పిలుపునిచ్చారు. ఖిల్లాఘణపురం మండలంలోని కోతులకుంట తండాలో గురువారం ఆమె పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. పథకాల వివరాలను వీజేఎంఎస్ ఆవాజ్ వనపర్తి కమ్యూనిటీ రేడియో ద్వారా వారికి వినిపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను వినియోగించుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరా రు. సంఘం ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని, వేసవిలో కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, సంస్థ సభ్యులు గంధం చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జయంతి ఉత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట పట్టణంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో గురువారం 430వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు నర్సింహాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. తులసి అర్చన, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ అనంతరం పల్లకీ సేవ, మధ్యాహ్నం మహారథోత్సవం నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్యుడు, విద్వాన్ అనిల్ దేశాయి అధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో విద్వాన్ హరీశ్ అచార్య, రాఘవేంద్ర సేవాసమితి సభ్యులు సీతారామారావు, రాఘ వేందర్ రావు, అనంత్‌రావు, శ్రీపాద్, ధరణీదర్ దీక్షిత్, శేషు, నర్సింహ, ప్రసాద్, ప్రకాష్, నారాయణరావు, పద్మనాభరావు, ప్రభంజన్‌రావు, భరత్ పాల్గొన్నారు.

ఏడుగురు కానిస్టేబుల్స్‌కు పదోన్నతి

మహబూబ్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరులో పని చేస్తున్న ఏడుగురు కానిస్టేబుల్స్‌కు హెడ్‌కానిస్టేబుల్స్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చిన్నా నాయక్‌ను తెల్కపల్లికి, వై బాలయ్యను డీఎస్‌బీ నాగర్‌కర్నూల్‌కు, డీ రాములును పెంట్లవెల్లికి, ఎన్ రాజేశంను డీఎస్‌బీ తిమ్మాజిపేటకు కేటాయించారు. నారాయణపేటకు చెందిన బీ రాజును డీఎస్‌బీకి, గద్వాలకు చెందిన ఎం వెంకటయ్యను రూరల్‌కు, వనపర్తికి చెందిన వి నాగరాజును రేవల్లి పోలీస్‌స్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో మక్తల్ విద్యార్థి ప్రతిభ

» బంగారు పతకం సాధించిన గుంతలి రాజేశ్



విద్యార్థి గుంతలి రాజేష్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్ హెన్నీ, షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం

మక్తల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ విద్యార్థి ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నాడు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 1 నుంచి 3 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో మక్తల్ ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి గుంతలి రాజేశ్ అద్భుతంగా రాణించి బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హెన్నీ, షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం విద్యార్థిని అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో షూటింగ్‌బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్, పీఈటీలు స్వప్న, శివశేఖర్, శివప్రసాద్, రాజేశ్వరి, మల్లారెడ్డి, చందు, శ్రీనివాస్, క్రీడాకారుడి తల్లిదండ్రులు పద్మ, శివ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు



అయిజ పట్టణంలోని రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారి

అయిజటౌన్, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : అయిజ మున్సిపాలిటీలో ఉన్న రేషన్ దుకాణాల్లో గురువారం ఎన్‌ఫోర్స్‌మెం ట్ అధికారులు తనిఖీలు చేశారు. పట్టణంలో ఉన్న 18షాపులకుగాను 3, 8, 43, 5, 12, 13 నెంబర్ల షాపుల్లో త నిఖీలు చేసి బియ్యం నిల్వలకు సంబదించిన వివరాలను ఆయా డీలర్లనడిగి తెలుసుకున్నారు. రేషన్ షాపులు నిర్వహించే డీలర్లు లబ్ధిదారులు ప్రతీ నెల తీసుకునే రేషన్ బియ్యాన్ని విక్రయించకుండా ఒండుకుని తినేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం పం పిణీ చేసే రేషన్ బియ్యంలో విటమిన్ బి12తో పాటు, ఫోరిక్ ఆమ్లము, ఐరన్‌లు ఉంటాయని తెలిపారు. డీలర్లు కూడా లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసినట్లు ఎక్కడైనా బయటపడితే శాశ్వతంగా వారి ని తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ ప్రశాంత్‌గౌడు, షాపుల డీలర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

గద్వాల న్యూటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు బీచుపల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్పకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ 104 అంబులెన్స్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత ఏడాది నవంబర్ నుంచి ఇప్పటివరకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రీహరి, శేఖర్, మణికంఠ, పాషా, ధనలక్ష్మి, అతిక్ అహ్మద్, సాయిబాబా ఉన్నారు.

909 గ్రాముల గంజాయి స్వాధీనం

» విక్రయిస్తుండగా పట్టుకున్న పోలీసులు

» జార్ఖండ్‌కు చెందిన ఐదుగురి అరెస్టు, రిమాండ్

బిజినేపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం, వసంతాపూర్ గేటు సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కనకయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వసంతాపూర్ గేట్ వద్ద బుధవారం సాయంత్రం కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గేట్ సమీపంలో గంజాయి అమ్ముతున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిట్‌కుమార్ రామ్, అప్పుకుమార్, మహేశ్, దుర్గాప్రసాద్, వినయ్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 909 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గురువారం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రధాన నిందితుడు బిట్‌కుమార్ రామ్ పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం రిజర్వాయర్ నిర్మాణంలో కూలి పని



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కనకయ్య, చిత్రంలో ఎస్‌ఐలు కె.శ్రీనివాస్, రాజశేఖర్

చేస్తున్నట్లు తెలిపారు. జార్ఖండ్ నుంచి గంజాయి తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మరో ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది రమేశ్, కానిస్టేబుళ్లు దాడిచేసి, నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు.

ఆపద మిత్ర వలంటీర్లకు శిక్షణ

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో ఎంపికైన 300 మంది ఆపద మిత్ర వాలంటీర్లకు 3 దశలలో శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమాన్ని పరిశీలించేందుకు కేంద్ర అధికారులు ఆర్‌ఎస్ మిశ్రా, లికుస్‌పాత్రాలు, రాష్ట్ర నోడల్ అధికారి గౌతమ్‌లు గురువారం జిల్లా కేంద్రానికి వచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కొనసాగుతున్న శిక్షణను పరిశీలించారు. శిక్షణలో మాజీ సైనికులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, నెహ్రూ యువ కేంద్రం, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొనడంపై ఆనందం వ్యక్తం చేశారు. వలంటీర్లతో మాట్లాడి వారి అవగాహన స్థాయిని తెలుసుకున్నారు. గ్రామ స్థాయిలో ఆకస్మికంగా సంభవించే, సహజ, మానవ చర్యల వల్ల కలిగే విపత్తుల సమయంలో ఎలా ప్రతిస్పందించాలో ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి కిశోర్, తహసీల్దార్ జె.సువర్ణరాజు, జిల్లా కో-ఆర్డినేటర్ హన్మంతు పాల్గొన్నారు.

నీటి వాటా కోసం పోరాటం

» జలసాధన కోసం జేఏసీలు ఏర్పాటు చేసుకోవాలి

» పాలమూరు అధ్యయన వేదిక పిలుపు

పాలమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా బేసిన్‌లోని అన్ని జిల్లాల్లో నీటివాటా కోసం జలసాధన జేఏసీలను ఏర్పాటు చేసుకొని పోరాడుదామని పాలమూరు అధ్యయన వేదిక పిలుపు నిచ్చింది. ఈ మేరకు వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ప్రభుత్వాలు నిధులన్నింటినీ ఆంధ్ర ప్రాంతంలో ఖర్చుచేస్తూ కృష్ణానది జలాల దోపిడికి పాల్పడుతున్నాయని ఎన్నో పోరాటాలు చేసినట్లు పేర్కొన్నారు. కృష్ణా నదీ జలాల పునఃపంపిణీ కోసం ఉద్యమించినట్లు తెలిపారు. ఆ ఉద్యమంలో నుంచే తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం పుట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రం సాధించుకుని పదకొండేళ్లు అవుతోందని, కానీ రైతుల భూములకు నీళ్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి కోసం బోర్లు వేసుకునే దుస్థితి నుంచి, నీటి కోసం అప్పుల పాలయ్యే పరిస్థితి నుంచి రైతులు బయటపడలేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నీళ్లు పంచకుండా, ఆంధ్ర పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తోందని ఆరోపించారు. కేంద్రంతో పోరాడి నీటి వాటా సాధించడంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రం వివిధ పథకాలతో కృష్ణానీటిని తరలించుకునేలా సహకరించిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పదిహేను నెలలు గడుస్తున్నా కృష్ణానది నీటి సాధనకు, నీరు తీసుకోవడానికి కృషి చేయడం లేదని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిని వారిని, సంస్థలు, పార్టీలను కలిపేసుకొని చేసుకుని తెలంగాణ గొంతు వినబడకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జల వనరుల కల్పన, జల సాధనకు సంబంధించి ఏ రాజకీయ పార్టీ ఎజెండాలోనూ ఒక విధానం, సమగ్ర ప్రణాళిక లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజలు చైతన్యంతో మేల్కొని భవిష్యత్తును నిర్మించుకునేందుకు, స్వావలంబన సాధించేందుకు జలసాధన ఉద్యమంలోకి రావాలని కోరారు. జేఏసీలు ఏర్పాటు చేసుకొని, పోరాడాలని సూచించారు. జలసాధన కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

న్యూస్ బాక్స్

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీ

- మునిసిపల్ కమిషనర్ నరేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ నరేష్ బాబు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అనుమతిలేని లేఅవుట్‌లోని ప్లాట్లను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు మార్చి 31 వరకు 25శాతం రాయితీ ఇస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ నరేష్‌బాబు తెలిపారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో లైసెన్స్ టెక్నికల్ ప్లానర్స్ (ఎల్‌టీపీ)లతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ జీవో నెంబరు 28తో గత నెల 20 నుంచి ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి వికాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి వాల్మీకి మహర్షి ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు



నూతన ఆలయం

తిమ్మాజిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో సీతారామచంద్రస్వామి సమేత వాల్మీకి మహర్షి ఆలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 8 నుంచి ప్రారంభమవుతాయని వాల్మీకి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పదో తేదీ వరకు కొనసాగుతాయని, ప్రతీ రోజు రాత్రి భజన కార్యక్రమాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అప్పాజీపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చిలుక వివేకరెడ్డి తన సొంత నిధులు దాదాపు రూ. పది లక్షలతో ఆలయాన్ని నిర్మాణానికి అందజేశారు. 10న సీతారామచంద్రస్వామి, వాల్మీకి, లక్ష్మణ, ఆంజనేయ, గణపతి యంత్ర ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని సభ్యులు కోరారు.

ఘనంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి ప్రభోత్సవం

మన్ననూర్, మార్చి6(ఆంధ్రజ్యోతి) : రాయలగండి లక్ష్మీ చెన్నకేశవ స్వామి ప్రభోత్సవాన్ని బుధవారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ కాలనీలోని రామాలయం వద్ద ప్రత్యేక పూజలందుకున్న లక్ష్మీ చెన్నకేశవ స్వామి ప్రతిమను విద్యుద్దీపాలంకరణతో యువకుల నృత్యాల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గురువారం వేకువజామున ప్రభను రాయలగండి ఆలయ ప్రాంగణానికి తరలించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు శేషయ్య, గంగాధర్, మధు, పురుషోత్తం, పర్వతాలు, సైదులు అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నర్సరీలపై శ్రద్ధ పెట్టాలి

చారకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. గురువారం మండంలోని సిర్సనగండ్ల, రామచంద్రాపురంలో నర్సరీ, గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవిలో నర్సరీల్లోని మొక్కలు చనిపోకుండా షేడ్ నెట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామాల్లో వాటర్‌ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించాలన్నారు. అనంతరం మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయం ఆవరణలో శానిరి కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేష్, ఏపీవో లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు సురేందర్ రెడ్డి, శ్రీను, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పలువురికి రక్త పరీక్షలు

పెద్దకొత్తపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బస్టాండ్ ఆవరణలో ప్రజలకు ఎయిడ్స్ రక్త పరీక్షలు గురువారం నిర్వహించారు. వైఆర్‌జీకేవై ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్, ఎమ్మార్పీఎస్ మదర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు పలువురికి నిర్వహించం జరిగిందని ఐసీటీసీ కౌన్సెలర్ సురేందర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80మందికి ఎయిడ్స్ రక్త పరీక్షలను స్వచ్ఛందంగా నిర్వహించినట్లుచెప్పారు. కార్యక్రమంలో వైఆర్‌డీకే సూపర్‌వైజర్ రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ సంస్థ మేనేజర్ శివ, క్లస్టర్ లింకు వర్కర్ నాగరాజు, ఎంఆర్‌డీఎస్ ఓఆర్ డబ్ల్యూ బాలపీరు, రాధిక ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

పెద్దకొత్తపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సాతాపూర్ గ్రామానికి చెందిన సత్తారి వెంకటయ్యగౌడ్ అనారోగ్యంతో ఇటీవల మరణించారు. గురువారం దశదినకర్మ కార్యక్రమంలో కౌండిన్య దళం (గౌడ సంఘం) నాయకులు పాల్గొని వారి కుమారులు మల్లేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్‌గౌడ్‌లకు రూ10వేల ఆర్థిక సహాయం అందజేశారు. మండల అధ్యక్షుడు ఉదయ్‌గౌడ్, భరత్‌గౌడ్, కవీందర్‌గౌడ్, ఈశ్వరయ్య గౌడ్, సాయికుమార్‌గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, బిచ్చన్నగౌడ్, పెద్దశ్రీనుగౌడ్, శేఖర్‌గౌడ్, నరేష్‌గౌడ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి కృషి



వసురాంతండాలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్ రెడ్డి

బిజినేపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన ప్రభుత్వం తండాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. మండలంలోని వసురాంతండాలో గురువారం నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. తండాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి, డ్రైనేజీ, పాఠశాలలో మౌలిక వసతులు వంటి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. ఇల్లు లేని ప్రతీనిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీజ తెలిపారు. అంతకు ముందు అలుగు తండా, వసురాంతండాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, వెంకటస్వామి, హరీష్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వీరేందర్, రాంచందర్ నాయక్, మాజీ సర్పంచులు అవంతి శంకర్, గంగనమోని తిరుపతయ్య, రాంచందర్, అమృత్‌రెడ్డి, గోవిందు నాయక్, బసవ రెడ్డి ఉన్నారు.

పిల్లలను రెగ్యులర్‌గా పాఠశాలలకు పంపాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో కోనేరు సంస్థ సభ్యులు

- కోనేరు సంస్థ ఆధ్వర్యంలో అవగాహన

తెలకపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో బడి బయటి పిల్లలను తప్పక పాఠశాలకు పంపాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీశైలం మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెగ్యులర్ ఉన్న పిల్లలకు కైలాస సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో బడికి వెళ్లని పిల్లల కుటుంబాలకు అవగాహన కల్పించడానికి మండల కేంద్రంలో గురువారం సమావేశం నిర్వహించారు. పిల్లలందరినీ పాఠశాలకు రెగ్యులర్‌గా పంపించాలని, పాఠశాలకు వెళ్లకుంటే ఇంటి దగ్గర ఉంటే వచ్చే ఆలోచనలు చెడుకు దారి తీస్తాయని పేర్కొన్నారు. పిల్లలపై లైంగిక వేధింపులు చేసినా, బాల్య వివాహాలు చేసినట్లు మీ దృష్టికి వచ్చినా వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు.

మాదిగల డప్పు ప్రదర్శనను జయప్రదం చేయాలి

- ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్



మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన మాదిగల ఆత్మగౌరవ డప్పు మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై డాక్టర్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో ఉన్న లోటు పాట్లను సవరించి రాష్ట్రంలో తక్షణమే స్పందించి మాదిగల జనా భాకు అనుగుణంగా 11 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, నాయకులు గుడికానిపల్లి రాజు, నల్లగంటి నాగన్న, విజయ్, భీంరాజ్, జంపుల్, మధు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు

కల్వకుర్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదును గురువారం ఆ సంఘం నాయకులు నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని బలరాంనగర్, మండలంలోని తర్నికల్, వేపూర్, తోటపల్లి, ఎల్లికట్ట, రఘుపతిపేట, కుర్మిద్ద గ్రామాల్లో టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదును నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మొగులయ్య, రామస్వామి, శ్రీశైలం, రవీందర్ ఉన్నారు.

బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

పెంట్లవెల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లేశ్వరం గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షునిగా పాయాల స్వాములు, వైస్ ప్రెసిడెంట్‌గా బోయ మద్దిలేటి, ప్రధాన కార్యదర్శిగా కురుమ య్యను ఎన్నుకున్నారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిరంజీవి, రామకృష్ణ, బాలపీరు, చిన్న నరసింహ, సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా హెల్త్ క్యాంపు విజయవంతం

తాడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఇంద్రకల్ గ్రామంలో గురువారం జిల్లా జనరల్ ఆసుపత్రి వారి సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ వైద్య శిబిరం తాడూరు ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారి సృజన దిశా క్లస్టర్ ప్రోగ్రామ్ రమేష్ మాట్లాడుతూ ఇటీవల ప్రబలుతున్న వివిధ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా 142 మందికి హైపొటైటిస్ సిఫలిస్ హెచ్‌ఐవీతోపాటు జనరల్‌గా వచ్చే బీపీ, షుగరు వంటి వ్యాధులపై కూడా రక్త పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ శివశంకర్, ఎస్ఎస్‌కే.మేనేజర్ శివకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ మాధురి, ఎల్‌హెచ్‌వో అహ్మద్‌అలీ, ఏఎన్ఎమ్ సుమలత, ఏఎన్‌డీ ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూవో సురేందర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఉప్పునుంతల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలోని మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యాధికారి స్వప్న వైద్యపరీక్షలు చేశారు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన తీసుకోవాల్సిన జాగ్రత్తలు అదే విధంగా వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత వల్ల చాలా రోగాలు దరి చేరవని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శుభాకర్, జగదీష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శంషుద్దీన్

చారకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్ఐ శంషుద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర, ఫోర్ వీలర్ వాహనదారులు, హెల్మెట్, సీటుబెల్టులు ధరించాలని అన్నారు. ఎస్ఐ వెంట సిబ్బంది ఉన్నారు.

మార్చి 31లోపు ఎల్‌ఆర్‌ఎస్‌కు చివరి గడువు

- మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్



కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌కు ఎల్‌ఆర్‌ఎస్ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

కొల్లాపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పరిధిలో 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి 25 శాతం రాయితీ అందిస్తున్నట్లు ప్రకటించిందని కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. ఈ ఎల్‌ఆర్‌ఎస్ పరిధిలో 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి రాయితీ పొందేందుకు అర్హులైన అభ్యర్థులు తమ బకాయిలను పూర్తిగా మార్చి 31 లోపు చెల్లించాలన్నారు. 2020 లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసిన వారు ఉండాలన్నారు. పూర్తి బకాయిని ఒకేసారి చెల్లించాలని, వెబ్‌సైట్ ద్వారా లేదా ఈ ఫోన్ నెంబర్లను 9848444798, 9460239750లను సంప్రదించాలని ఆయన తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

108 వాహనంలో ప్రసవం

బల్మూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు చేరువలో సేవలందిస్తున్న 108 వాహనంలో ధారారం గ్రామానికి చెందిన మహిళ ప్రసవించింది. సదరు మహిళ పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబీకులు 108సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లోనే డెలివరీ చేసి బాధితురాలు లక్ష్మి, ఆమె పాప క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది, స్టాఫ్ నర్సు లలిత, డ్రైవర్ వెంకట్ తెలిపారు.

ఘనంగా బీరప్ప పండుగ

తెలకపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గట్టురాయిపాకుల, తెలకపల్లిలో బీరప్ప పండుగలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదిగొండ, మేకల వంశస్థులు పండుగలను ఘనంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆ గ్రామాల్లోని బీరప్ప గుడిల దగ్గర భక్తులు పాల్గొన్నారు.

'ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలి'

కందనూలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ నిధులను వెంటనే విడుదల చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మీపతిలు కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి వేములవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు మారేడు శివశంకర్, రాము, శ్రీను, లింగస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

దళారుల చేతుల్లో మోసపోవద్దు

బల్మూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు కనీస మద్దతు ధరకే అమ్ముకోవాలని మండల వ్యవసాయ అధికారి కావేటి నరేష్ తెలిపారు. తుమ్మన్‌పేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ జబ్బు నర్సయ్య కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఖదీర్‌లతో కలిసి పరిశీలించారు. వేరుశనగ కొనుగోలు మండలంలోని తుమ్మన్‌పేటలో జరుగుతుందని, రైతులు కొనుగోలు కేంద్రానికి పల్లీలను తీసుకు రావాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న వేరుశనగను తప్పక కొనుగోలు చేస్తారని వారు తెలియజేశారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



విద్యార్థుల ప్రతిభ అడిగి తెలుసుకుంటున్న డీఈవో రమేశ్‌కుమార్

- డీఈవో రమేశ్ కుమార్

ఉప్పునుంతల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, పుస్తక పఠనంతో విమర్శనాత్మక ఆలోచన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఈవో రమేశ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక జడ్పీహెచ్ఎస్, కస్తూర్బాబాలిక పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతీ రోజు పుస్తక పఠనం చేయాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు నిర్వహిస్తున్న కరాటే శిక్షణను ఆయన పరిశీలించారు. విద్యార్థులు ఏకగ్రతతో చదువుకొని రానున్న పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకోగా, ఆ వేడుకలోనూ డీఈవో పాల్గొన్నారు. చక్కగా బోధించిన ఉపాధ్యాయులను అభినందించి, బహుమతులు అందజేశారు. హెచ్ఎం బిచ్యానాయక్, సైదా, ఉపాధ్యాయులు ఉన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంపై జిల్లా అధికారులకు నివేదిస్తా

- ఎస్సీ-బీ హాస్టల్ తనిఖీ చేసిన ఏఎస్‌డబ్ల్యూవో శ్రీకర్‌రెడ్డి



ఎస్సీ-బీ హాస్టల్‌లో విద్యార్థులను విచారిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో శ్రీకర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్వకుర్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఎస్సీ-బీ హాస్టల్‌లో విద్యార్థులచే వెట్టిచాకిరీ కథనంపై అధికారులు స్పందించారు. పట్టణంలోని ఎస్సీ-బీ హాస్టల్‌లో కల్వకుర్తి ఏఎస్‌డబ్ల్యూవో శ్రీకర్‌రెడ్డి ఉదయం తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులు బుధవారం కూరగాయలు కోయడం, ఇతర పనులు చేసిన విషయాలను, సిబ్బంది విధులకు హాజరు కాని తీరును అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని జిల్లా అధికారులకు నివేదిక సమర్పిస్తున్నట్లు ఏఎస్‌డబ్ల్యూవో శ్రీకర్‌రెడ్డి తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసు కుంటామని తెలిపారు.

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ

- పార్టీ పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్‌గౌడ్



స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

అచ్చంపేటటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రెండింటిని సొంతం చేసుకోవడంతో పార్టీ బలాన్ని మరోసారి స్పష్టంగా చాటిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎమ్మె ల్సీ స్థానాలలో గెలుపొందినందుకు గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, ఇదే సెగ్మెంట్ నుంచి టీచర్ ఎమ్మెల్సీగా మల్క కొమరయ్య గెలుపొందడంతో రాష్ట్రంలో బీజేపీ పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీనునాయక్, రేణయ్య, రామచంద్రయ్య, భీమయ్య, గోలి రేణయ్య, పత్యానాయక్, శివచంద్ర, చందులాల్, తేజస్విని, మహేశ్వరి, మధుభూపాని, భయ్యరాజు, చైతన్యచారి, అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఊర్కొండ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపొందడంతో ఊర్కొండలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, పరశురాములు, లక్ష్మారెడ్డి, శివ ఉన్నారు.

● కల్వకుర్తి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలు బీజేపీ గెలవడంపై కల్వకుర్తిలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిబీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో బీజేపీ నాయకులు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకు న్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, కృష్ణగౌడ్, రాఘవేందర్ గౌడ్, శేఖర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రవి, బాబీదేవ్, నరేష్ తదితరులు ఉన్నారు.

● కందనూలు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలు బీజేపీ గెలవడంపై నాగర్‌కర్నూల్‌లో బీజేపీ, తపస్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్ల రాజావర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాము, జిల్లా అధికార ప్రతినిధి శ్రీశైలం, నాయకులు నారాయణచారి, రాము, ప్రమోద్‌కుమార్, చందు, యాదగిరిరావు, ఇందిర, లక్ష్మీ, బాలమణి, సత్యనారాయణ, పెద్దబాబు, సుధాకర్, రాజేశ్వర్‌రెడ్డి, బాలరాజు, తపస్ జిల్లా అధ్యక్షుడు రాజీరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలుపుపై పీఆర్‌టీయూ నాయకుల సంబురాలు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్రంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రమేష్ కుమార్‌ను కలిసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బల్మూరు రాంచందర్‌రావు, గౌరవ అధ్యక్షుడు బిచ్యనాయక్, ప్రధాన కార్యదర్శి తుమ్మల సరేందర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు దొడ్ల సత్యనారాయణరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సూర్య శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, మల్లికార్జున్, పాలమూరు శ్రీనివాసులు,శేఖర్ గౌడ్, రాజయ్య, రాఘవేందర్, మంతటి శ్రీనివాసులు, వెంకటేష్, బాబురావు, జగదీష్‌రెడ్డి, ఫరూక్‌అలీ, సాయిబాబు, చంద్రమౌళి పాల్గొన్నారు.

గువ్వలోనిపల్లి పాఠశాలలో స్వపరిపాలన



ఉపాధ్యాయులైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉప్పునుంతల, మార్చి 6, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గువ్వలోనిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హెచ్ఎంగా కె నిత్యతో పాటు పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో కె హేవలత, ద్వితీయ స్థానంలో ఎన్ అక్షరకు బహుమతులు అందజేసినట్లు హెచ్ఎం ఎల్‌చంద్రనాయక్, తెలిపారు. ఉపాధ్యాయులు చైతన్య, ఉన్నారు.

● బిజినేపల్లి : మండలంలోని లట్టుపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పారు. డీఈవోగా శ్రీశైలం, ఎంఈవోగా నరహరి, హెచ్ఎంగా దేవికలు వ్యవహరించారు. అనంతరం గురువులతో కలిసి విద్యార్థులను తాము బోధించిన పాఠాలు అర్థమైనవి, కానివి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతయ్య, ఉపాధ్యాయురాలు సాయిజ్యోతి, శ్రీదేవి, సునిత, సీఆర్‌పీ సాంబశివుడు తదితరులు ఉన్నారు.



బిజినేపల్లి : లట్టుపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసులు

తెలకపల్లి/ కొల్లాపూర్/ ఉప్పునుంతల/ పెద్దకొత్తపల్లి/ పెంట్లవెల్లి/ బల్మూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార అధ్యయనంలో భాగంగా గురువారం తెలకపల్లి మండల పరిధిలోని కార్వంగ గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం గత సంవత్సరం పూర్తైనా ప్రారంభానికి నోచుకోకపోవడం విడ్డూరమన్నారు. ప్రస్తుత ఆరోగ్య కేంద్రం గ్రామ పంచాయతీలోనే కొనసాగించడం వలన అటు గ్రామ పంచాయతీకి ఇటు ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోపాస్ లక్ష్మణ్, నాయకులు నందిపేట భాస్కర్, గోరటి కాశన్న, గ్రామస్థులు తిరుపతయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ పట్టణ కార్యదర్శి ఎండి సలీం, జిల్లా కమిటీ సభ్యులు తారాసింగ్ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. కొల్లాపూర్ పట్టణం లో 7, 8వ వార్డుల పరిధిలో ఉన్న బస్సు డిపో పక్కన ప్రభుత్వ భూమిలో 1981 లో పేదలకు ఇంటి స్థలాల కోసం అప్పటి ప్రజాప్రతినిధులు పట్టాలిచ్చారని, మోకచూపలేదన్నారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు పట్టాలిచ్చి మోకా చూపించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు రాజు, నాగల లక్ష్మయ్య, పిట్టల రాంబాబు, రాజు పాల్గొన్నారు.

ఉప్పునుంతల మండలం కంసానిపల్లి గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు ఆధ్వర్యంలో సర్వే సర్వే చేపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీపీఎం నాయకులు లక్ష్మయ్య, రాములు, రామస్వామి, కిష్టయ్య, శివ ఉన్నారు.

పెద్దకొత్తపల్లి మండలంలోని కల్వకోల్ గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి దశరథం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపైన సర్వే నిర్వహించారు. తాగునీటి సమస్యను పరిష్కరిం చాలని కోరారు. సీపీఎం నాయకులు పెబ్బేటి శంకర్, ఈశ్వర్, సతీష్, ఎల్లయ్య, రాముడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.